క్లుప్తంగా

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఘర్షణ వాతావరణం సృష్టించేలా వ్యవహరిస్తున్నారని, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ యువజన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ ఉనికి కోసమే అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సందమల్ల నరేష్, టేకుల శ్రావణ్,బండ నవీన్,జంగ అనిల్,లంక దాసరి గంగరాజు,ఇప్పలపల్లి చంద్రశేఖర్,నరెడ్ల వినోద్‌రెడ్డి, చల్లూరి విష్ణు వర్ధన్,చెంచల మణిదీప్,జన్ను ప్రసాద్,ఆకునూరి అజిత్, నాగరాజు,కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మానకొండూర్‌రూరల్: ఎంపికైన విద్యార్థులు

మానకొండూర్‌రూరల్: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని వెల్ది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ.యూనిక్ పాషా తెలిపారు. బాలికల విభాగంలో తనూజ, లాస్య, హాసిని, సహస్ర, తనసి, సమీర, బాలుర విభాగంలో రాంచరణ్, సాయిచరణ్, రుత్విక సెప్టెంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు నిర్మల్ లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్లా హరిశంకర్, జిల్లా ఒలింపిక్ అధ్యక్షుడు మహిపాల్ , కార్యదర్శి జనార్దన్ రెడ్డి, డీవైఎస్‌వో శ్రీనివాస్, వెల్ది గ్రామ ప్రజలు విద్యార్థులను అభినందించారు.

రామడుగు: హన్మకొండలో శనివారం జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని వెలిచాల సరస్వతి స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి ముచ్చె చరణ్, గోపాలరావుపేట శ్రీప్రగతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి దండవేణి రామ్‌తేజ్ ఎంపికై నట్లు పాఠశాలల కరస్పాండెంట్స్ ఉప్పుల శ్రీనివాస్, అన్నదానం రాధాకృష్ణ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శుక్రవారం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మునీందర్‌రెడ్డి, పీఈటీ సాయికృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సంపత్

హుజూరాబాద్: ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో అండర్‌-14, 17 బాలుర విభాగంలో పట్టణ శివారులోని బోర్నపల్లిలో గల వీణవంక మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎం. సంపత్ తెలిపారు. మండల స్థాయి ఆటల పోటీలో 8 బంగారు పతకాలు సాధించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులకు క్రీడా పోటీల్లో తర్ఫీదు ఇచ్చిన పీఈటీ భరత్ కుమార్‌ని ప్రత్యేకంగా అభినందించారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

మానకొండూర్: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని మానకొండూర్ ఇన్‌చార్జి సీఐస్వామి సూచించారు. మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్తులు భక్తిశ్రద్ధలతో నిమజ్జనంలో పాల్గొనాలని, మానకొండూర్‌లో నిమజ్జనం రోజు వన్‌వే ట్రాఫిక్ ఉంటుందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, మద్యం విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చెరువు, కుంటల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఎస్టీయూ ఇల్లందకుంట కమిటీ



కందుగుల రవి, అధ్యక్షుడు

ఇల్లందకుంట: స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) ఇల్లందకుంట మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుగుల రవి, కార్యదర్శిగా భూక్య రవీంద్రనాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు, కార్యదర్శులను జిల్లా కౌన్సిలర్లు కిషన్, రామలక్ష్మి, ఎన్నికల అధికారి ఎండీ.రజాక్‌పాషా, పరిశీలకుడు శ్యాంకుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జమ్మికుంట, ఇల్లందకుంట బాధ్యులు రాజమౌళి, రజాక్, పురుషోత్తమ్‌మూర్తి, ఆనంద్, రఘు, నాగరాజు, సమ్మయ్య, మహేందర్, శ్రీనివాస్, సంతోష్, స్వామి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం | గ్రామస్తులకు శాపం



గర్రెపల్లి-సైదాపూర్ మధ్య వాగుపై అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి పనులు



కాంట్రాక్టర్ అమ్ముకున్న పాత కల్వర్టు పైపులు

- గర్రెపల్లి-సైదాపూర్ మధ్య బ్రిడ్జి నిర్మాణానికి గ్రహణం
- వేసవిలో అర్ధంతరంగా పనులు నిలిపివేత, పాత కల్వర్టు పైపులు అమ్ముకున్న వైనం
- భారీ వర్షాలకు రాకపోకలు బంద్

సైదాపూర్: సబ్ కాంట్రాక్టర్ రూపంలో గర్రెపల్లి-సైదాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గ్రహణం పట్టింది. మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధి గర్రెపల్లికి తారురోడ్డుతో పాటు బ్రిడ్జి నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2.40 కోట్లు మంజూరు చేసింది. 'ఇప్పుడు నిర్మించకుంటే అప్పటికి తిప్పలే' అనే కథనాన్ని సాక్షి ప్రచురించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించడంతో కథనం ప్రచురితమైన మర్నాడే పనులు ప్రారంభించారు. తారురోడ్డు పనులు తీరినప్పటికీ బ్రిడ్జి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వేసవిలో బేస్‌మెంట్ వరకు పనులు చేసి అర్ధంతరంగా ఆపేశాడు. వాటర్ క్యూరింగ్ చేయకపోగా అక్కడ ఉన్న పాత కల్వర్టు పైపులను అమ్ముకున్నాడు. కాంట్రాక్టర్ ఇష్టానుసారం పనులు చేస్తుంటే సంబంధిత అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడి పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి పనులు జరుగుతుంటే వర్షాకాలంలో రాకపోకలకు ప్రత్యామ్నాయంగా పాత పైపులతో దారి ఏర్పాటు చేయలేదని, దీంతో సైదాపూర్‌కు వెళ్లడానికి అదనంగా పది కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏళ్లుగా సమస్యలను పట్టించుకునే పాలకులు, అధికారులు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తి చేయించాలి



బ్రిడ్జి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. అర్ధంతరంగా ఆపేసిన బ్రిడ్జి పనులను పూర్తి చేయించాలి. సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయకుండా కాంట్రాక్టర్ చెప్పిందే వింటున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– తిప్పిరిశెట్టి మహేష్, గర్రెపల్లి

నరకం అనుభవిస్తున్నాం



బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో నరకం అనుభవిస్తున్నాం. విద్యార్థులు సోమారం నుంచి సైదాపూర్‌కు కాలి నడకన వెళ్లాల్సి వస్తోంది. ప్రతి పనికి సైదాపూర్ వెళ్లందే పొద్దుగడవదు. కాంట్రాక్టర్ నిర్వాకంతో తిప్పలు తప్పడంలేదు. పాతకల్వర్టు పైపులతో ప్రత్యామ్నాయంగా దారి ఏర్పాటు చేయించాలి.

– మోకిడి తిరుపతి, గర్రెపల్లి



శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో జాతీయ రహదారి మధ్యలో నూతన బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. జాతీయ రహదారి ఫోర్‌లేన్ పనుల్లో భాగంగా తాడికల్ శివారులో ఒకవైపు నుంచి వాహనాలు వెళ్తుండటంతో ట్రాఫిక్‌తోపాటు దుమ్ము లేస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దుమ్ములేస్తున్న జాతీయ రహదారి కథనానికి స్పందించిన ఎన్‌హెచ్‌ఏ అధికారులు యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో కరీంనగర్, వరంగల్‌వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సాక్షి స్పందన

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

నేడు విద్యుత్ సరఫరా బంద్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, కొండపల్కల, లింగాపూర్, వెల్ది, ఊటూరు, పోచంపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెంజర్ల, మానకొండూర్ ఏఈలు మెరుగు రమేశ్, షఫిహైమద్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ ఎం. శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంతోపాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



నిల్వ నీటిని తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

హుజూరాబాద్: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. డ్రై డేలో భాగంగా శుక్రవారం పట్టణంలోని తొమ్మిదో వార్డులో పర్యటించారు. వార్డు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంట్లోని చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారి సరిత, అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ, ఏఎన్ఎం రేణుక, ఆశా వర్కర్ శ్రీలత, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ ఉచిత కంటి వైద్యశిబిరం

వీణవంక: ఘన్ముక్కుల మోడల్ స్కూల్‌లో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సమస్య ఉన్నవారికి కళ్లద్దాలు అందజేశారు.

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో ప్రభుత్వ యునాని వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

✦ రక్త పరీక్షలు

జమ్మికుంట: పట్టణంలోని 16వ వార్డులో తెలంగాణ భవన, కార్మిక సంక్షేమ మండలి, కరీంనగర్ సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ప్రజలకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో రోగాల బారిన పడకుండా ఉండేందుకు రక్త నమూనాలను సేకరించారు.

✦ సీతారాం ఏచూరికి నివాళి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో అనారోగ్యంతో కన్నుమూసిన సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు శుక్రవారం పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఎన్‌వీ కృష్ణయ్యకు..

గన్నేరువరం: మండలంలోని చీమలకుంటపల్లెలో శుక్రవారం ఎన్‌వీ కృష్ణయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తెలంగాణ రైతు కూలీ సంఘం అధ్యక్షుడు బామండ్ల రవీందర్, కార్యదర్శి మాశం ఆంజనేయులు పూలమాల వేసి నివాళి అర్పించారు. 1984 నుంచి 1994 వరకు సిరిసిల్లా నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజలు, కార్మికులు, రైతులు, కూలీలకు సేవలందించినవాడని పేర్కొన్నారు.

✦ నియామకం

మానకొండూర్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రంగు సంపత్‌గౌడ్‌ను నియామకమయ్యారు. జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సంపత్ ధన్యవాదాలు తెలిపారు. కోర్టు తీర్పును అనుసరించి కులగణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

✦ వైద్యుల నిరసన

హుజూరాబాద్: అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. జమ్మికుంట ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలో పిల్లల డాక్టర్‌పై దాడికి నిరసనగా చలో పెద్దపల్లికి పిలునిచ్చారు.

బోర్ మోటార్ ప్రారంభం

చొప్పదండి: పట్టణంలోని తొమ్మిదో వార్డులో ఏర్పాటు చేసిన నూతన బోర్ మోటార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ శుక్రవారం ప్రారంభించారు.

✦ ఒత్తిడి, నివారణపై అవగాహన

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా మానసిక ఆరోగ్య విభాగం నిపుణుడు రమణాకర్‌రెడి మానసిక ఒత్తిడికి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శారీరక వ్యాయామాలు చేయడం వల్ల ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని సూచించారు.

మానకొండూర్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఒత్తిడి, నివారణపై సైకియాట్రిస్టు, డాక్టర్ పృథ్విరెడ్డి విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు.

✦ ఓటరు జాబితా ప్రదర్శన

గన్నేరువరం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఓటు జాబితా ప్రదర్శించినట్లు ఎంపీవో శ్రీనివాస్ తెలిపారు. అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని గ్రామపంచాయతీలో శుక్రవారం ఓటర్‌జాబితా ప్రదర్శించినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. 23 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

జమ్మికుంట: మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రచురణ చేశామని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీవో భీమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలపారు.

✦ ప్రొసీడింగ్స్ పంపిణీ

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం మహాలక్ష్మి ప్రొసీడింగ్స్‌ను అధికారులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 19 వరకు పంపిణీ చేస్తామని ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు.

కుంకుమపూజలు.. అన్నదానం

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని వినాయక మండపాల వద్ద మహిళలు శుక్రవారం కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పలువురు నాయకులు వినాయకుడిని దర్శించుకున్నారు. మండప నిర్వాహకులుతీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు మంగహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గన్నేరువరం: మాదాపూర్‌లో కుంకుమపూజ



శంకరపట్నం: కేశవపట్నంలో..



చిగురుమామిడి: ఇందుర్తిలో..



వీణవంక: బేతిగల్‌లో..



జమ్మికుంట: పూజల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ స్వప్నకోటి, తదితరులు



ఇల్లందకుంటలో మంగళహారతులు..



మానకొండూర్: అన్నారంలో..



హుజూరాబాద్‌లో..



గంగాధర: కురిక్యాలలో..



చొప్పదండిలో..



తిమ్మాపూర్‌లో...

ముగిసిన క్రీడాపోటీలు



బహుమతులు అందజేస్తున్న సీఐ రవి, టీచర్లు

గంగాధర: మండల కేంద్రంలో అండర్14, 17 బాలబాలికలకు నిర్వహించిన ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రెండు రోజులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. ముగింపు మాజీ సర్పంచ్ గంగాధర్, ఠాగూర్, శ్రీనివాస్, గంగాధర ప్రవీణ్, తాళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని బాలుర పాఠశాలలో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. గెలుపొందినవారికి టౌన్ సీఐ వరంగంటి రవి బహుమతులు అందించి మాట్లాడారు. క్రీడలతో మానసిక , శారీరక ఉల్లాసం కలుగుతుందని, ప్రతి రోజుల ఆటల్లో పాల్గొనాలని సూచించారు. మండల ట్రస్మా అధ్యక్షుడు డాక్టర్ సంపత్‌రావు, హెచ్‌ఎంలు సదానందం, సుధాకర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీలత, టీజీపీఏటీఏ అధ్యక్షుడు సోల్లు సారయ్య, పీఈటీలు, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్లకు తీవ్రగాయాలు

సైదాపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆకునూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమ్మయ్య, సుధాకర్ శుక్రవారం ఉదయం శంకరపట్నం నుంచి స్కూటీపై పాఠశాలకు బయలుదేరారు. సోమారం శివారులో ఓ కారును ఓవర్‌టేక్ చేసి సైదాపూర్ నుంచి మోడల్ స్కూల్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొట్టారు. ఈప్రమాదంలో టీచర్లకు తీవ్ర గాయాలుకాగా 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అదృశ్యం కేసు నమోదు

జమ్మికుంట: తల్లి, ఇద్దరు పిల్లల అదృశ్యం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన ఓ మహిళ ఆమె కూమారుడు, కూతురుతో కలిసి గురువారం నుంచి కనిపించడం లేదని, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త మండ సురేశ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లె గ్రామ సమీపంలో వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం గన్నేరువరంలో పట్టుకున్నట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. అనంతరం ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని బీఆర్‌ఎస్ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి పట్ల కొన్నిచోట్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాన రహదారులపై ధర్నాలు చేశారు. ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎమ్మెల్యేకే భద్రత కరువైందని, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే మరో ఎమ్మెల్యే దాడిచేయడం దారుణమన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్, ఎంపీడీఓ సరిత, తహసీల్దార్ రాజేశ్వరి, సూపర్‌వేజర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని హన్మాజిపల్లె గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహించారు. పిల్లల బరువు లెక్కించి, అక్షరాభ్యాసం నిర్వహించారు.

గంగాధర: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి సూచించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు.

రామడుగు: పోషణ మాసంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొక్కెరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

చిగురుమామిడి: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఖాజామొయినోద్దిన్ కోరారు. మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో మాట్లాడారు.

శంకరపట్నం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలు నిర్వహించారు.

ఇల్లందకుంట: మండలంలోని కనగర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైల్డ్ రైట్స్ మెంబర్ శోభారాణి హాజరై మాట్లాడారు. పోషక ఆహారం తీసుకుంటే రోగాలు దరిచేరవని, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రక్త హీనత పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. పోషకాహార ప్రాముఖ్యత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన, అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు.

హుజూరాబాద్‌రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో సుగుణ అన్నారు. ఎంపీడీవో ఆఫీసులో పోషకాహారంపై అవగాహన కల్పించారు. మంచి ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు.